సాక్షి కర్నూలు

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో బుధవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో చిరు జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.

పరివార దేవుళ్లకు పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



గణపతి ఉత్సవాలు ప్రారంభం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సోమవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు వాడవాడలా గణేష్ విగ్రహాలు నెలకొల్పి పూజలు చేస్తున్నారు.

8లో▸

న్యూస్‌రీల్

రేపు శ్రీశైలంలో ఏపీసీబీఏ జనరల్ బాడీ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంక్స్ అసోసియేషన్ (ఏపీసీబీఏ) జనరల్ బాడీ సమావేశం ఈ నెల 21న గురువారం సాయంత్రం శ్రీశైలంలో జరుగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో న్యూ సర్వీస్ రెగ్యులేషన్స్‌పై ప్రదానంగా చర్చించనున్నారు. అన్ని జిల్లాల సహకార కేంద్రబ్యాంకు చైర్మన్‌లు, సీఈవోలు కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్పర్సన్ ఎస్వీ విజయమనోహరి, సీఈవో పి.రామాంజనేయులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

కేఎంసీలో 248 మంది విద్యార్థుల చేరిక

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో ఎంబీబీఎస్ కోర్సులో 250 మంది విద్యార్థులకు గాను 248 మంది చేరారు. ఇందులో ఆలిండియా కోటాలో 37కు గాను 35 మంది ఉండగా వారిలో 14 మంది యువతులు, 21 మంది యువకులు ఉన్నారు. స్టేట్ కోటాలో 213 మందికి గాను 212 మంది చేరారు. వీరిలో 116 మంది యువతులు, 96 మంది యువకులు ఉన్నారు. కాగా ఎంబీబీఎస్ కోర్సులో చేరేందుకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ముగిసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ ప్రకటించారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

కర్నూలు (అర్బన్): జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లోని సచివాలయాల పరిధిలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు మొబైల్ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 90 ఆధార్ కేంద్రాలు ఉన్నాయని, వీటి ద్వారా ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల్లో నమోదుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు చేయడం, ఆధార్ నమోదు పూర్తయినా కార్డు లేని వారు, 0 నెంచి 5 సంవత్సరాలు, 5 నుంచి 16 సంవత్సరాల బాల బాలికలు, ఇంటి చిరునామా, మొబైల్ నెంబర్, ఫొటో మార్చుకోదలచిన వారు, వేలి ముద్రలు, బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోదలచిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 2010 నుంచి 2016 సంవత్సరాల మధ్య ఆధార్ నమోదు చేసుకొని, ఆ తర్వాత ఒక్కసారి కూడా అప్డేట్ చేసుకోని వారు విధిగా ఆధార్ కేంద్రాలను సందర్శించాలన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పెంపు

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు ఉన్న గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్, మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలు, వసతి సౌకర్యంలోని ఏపీ మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల చేత ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తూలు చేయించాలని సూచించారు. వీరందరికి డిసెంబర్ 3వ తేదీన రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో సంప్రదించాలన్నారు.

వైభవంగా స్వాతి మహోత్సవం



ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదస్వామి

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. నరసింహ స్వామి అవతార దినమైన స్వాతి నక్షత్రాన్ని పురష్కరించుకుని స్వామి జయంతి మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నావ నారసింహ క్షేత్రాల్లోని దేవాలయాల్లో కొలువై స్వయంభూగా వెలసిన లక్ష్మీ నరసింహస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా దిగువ అహోబిలంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వాముల ఉత్సవమూర్తులను దేవాలయం ఆవరణలోని యాగశాలలో కొలువుంచారు. అనంతరం నవకళ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య శ్రీ సుదర్శన, స్వాతి హోమాలు వైభవోపేతంగా నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు.



ప్రభంజనం.. డోన్ బహిరంగ సభకు తరలివచ్చిన అశేషజనం

పండుగలా దిగివచ్చావు!

జన సాగరం

- 77 చెరువులకు నీళ్లిచ్చిన సీఎం వైఎస్ జగన్
- పశ్చిమ ప్రాంత కరువును పారద్రోలిన నేత
- కృష్ణగిరి మండలం ఆలంకొండలో స్విచ్ ఆన్ చేసి చెరువులకు నీటి విడుదల
- డోన్ బహిరంగసభలో పోటెత్తిన జనం
- ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటుతో ప్రసంగ వీక్షణం
- అడుగడుగునా అభిమానుల ఘన స్వాగతం

దారి పొడవునా జన సాగరం ఉప్పొంగింది. సభా ప్రాంగణం పోటెత్తింది. గుట్టలు.. కొండలు దాటుకొని అభిమానం బారులుదీరగా.. అడుగడుగునా ఆత్మీయత పరుచుకుంది. మా నమ్మకం నువ్వే.. థ్యాంక్యూ సీఎం సర్ ప్లకార్డులు హుషారెత్తించగా.. ఈలలు, కేకలతో ఉత్సాహం ఉరకలేసింది. మనవడిని చూడాలనే తపన వృద్ధులలో.. తోబుట్టువును పలకరించాలనే సంబరం మహిళల్లో.. అన్నను కలవాలని యువత.. మేము సైతమని దివ్యాంగులు.. తోడూనీడగా నిలుస్తున్న నేతకు అభివాదం చేసేందుకు ఊరూవాడా ఒక్కటై కదిలింది. బీడు భూముల్లో సిరులు పండించేందుకు కృష్ణమ్మ పరుగులు తీయగా.. రైతన్నల ముఖాల్లో ఆనందం వెలుగులీనింది.



మాది రైతు ప్రభుత్వం.. సభలో బహూకరించిన నాగలితో..

కర్నూలు(సెంట్రల్/కృష్ణగిరి): పండుగ పూట దుర్భిక్ష రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేశారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో కరువు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు 77 చెరువులకు కృష్ణా జలాలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం ఆయన అలంకొండలో చెరువులకు నీరు అందించేందుకు పంపుహౌస్‌లో స్విచ్ ఆన్ చేశారు. పైలాన్‌ను ఆవిష్కరించారు. అక్కడి నుంచి నేరుగా డోన్ చేరుకొని బహిరంగ సభలో మాట్లాడారు. పత్తికొండ, డోన్‌తో పాటు పలు నియోజకవర్గాల్లోని చెరువులకు నీరందించే కార్యక్రమాన్ని పండుగ రోజు ప్రారంభించడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు.

అలనాటి రాయల వైభవం

గేట్ వే ఆఫ్ రాయలసీమగా కర్నూలును పిలుస్తారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని డోన్, పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల్లో నిత్యం కరువే. బతుకుదెరువు కోసం ఇక్కడి ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. వలస పోతే తప్ప కడుపు నిండని పరిస్థితి. గత పాలకులు ప్రజల కన్నీళ్లు, కష్టాలను ఓటు బ్యాంకుగా మలుచుకున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టును చేపడితే.. ఆయన తనయుడు 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీడు భూముల్లో బంగారు పంటలు పండించేందుకు సాగు నీటిని అందించే బృహత్తర కార్యక్రమానికి బాటలు వేశారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి నీటిని పంప్ చేసుకొని 77 చెరువులకు నీరందించేలా పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశారు. వినాయక చవితి రోజున సీఎం వైఎస్ జగన్ ఇక్కడి ప్రజలకు పెద్ద బహుమానం ఇచ్చారని, ఆయనకు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణ పడి ఉంటారని.. అలనాటి రాయల వైభవాన్ని సీఎం గుర్తుకు తెచ్చారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. కార్యక్రమంలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, అంజద్ బాషా, అంబటి రాంబాబు, గుమ్మనూరు జయరాం, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీలు డాక్టర్ మధుసూదన్, ఇషాక్, రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, శిల్పా రవి చంద్రకిషోర్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, బాలనాగిరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి, ఆర్థర్, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, సుధాకర్, సాయిప్రసాద రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్‌కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సృజన, మనజీర్ జిలానీ, కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు జిల్లా ఎస్‌ఈ రెడ్డిశేఖరరెడ్డి, మాజీ ఎంపీ బుట్టారేణుక, నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల నెరవేరింది.. ఆలంకొండ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం



కరువు నేల వైపు.. ట్యాంక్‌లోకి చేరుతున్న కృష్ణా జలాలు



అదిగదిగో మామయ్య..



సుస్వాగతం.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బొకే అందజేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



రైతు బాంధవుడిని చూసేందుకు..




సభా ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న చిత్రం



అన్నవచ్చాదోచ్.. యువత బైక్ ర్యాలీ



యువత పరవశం.. బస్సులో జగనన్నను చూసిన ఆనందంలో యువకులు




నీవే స్ఫూర్తి.. మహానేతకు నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పర్యటన సాగిందిలా..

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 10.10 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు.
- మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, అంబటి రాంబాబు, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డీఐజీ సెంథిల్‌కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, శిల్పా చక్రపాణిరెడ్డి, తొగురు ఆర్థర్, డాక్టర్ జె.సుధాకర్ తదితరులు స్వాగతం పలికారు.
- అక్కడి నుంచి కృష్ణగిరి మండలం ఆలంకొండకు 10.45 గంటలకు చేరుకోగా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్వాగతం పలికారు.
- 10.56 గంటలకు పంపు హౌస్ చేరుకొని 77 చెరువులకు నీటిని నింపే ప్రాజెక్టుకు సంబంధించిన పైలాన్‌ను ప్రజాప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. పంపుహౌస్ పైఅంతస్తులో ఏర్పాటు చేసిన మోటార్ల స్విచ్ ఆన్ చేశారు.
- స్విచ్ చేయగానే ఆలంకొండ సమీపంలోని కొండ పైన ఏర్పాటు చేసిన బావిలోకి, అక్కడి నుంచి చెరువుల వైపు నీళ్లు పరుగులు పెట్టాయి.
- అక్కడి నుంచి డోన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 11.45కు, బహిరంగసభకు 12 గంటలకు చేరుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.
- అనంతరం డోన్ నుంచి మధ్యాహ్నం 2.23 గంటలకు ఓర్వకల్లు చేరుకోగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య జ్ఞాపికను బహూకరించారు. మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, ఎయిర్‌పోర్టు డైరక్టర్ విద్యాసాగర్ వీడ్కోలు పలికారు.

మోడల్ నియోజకవర్గంగా డోన్

- సభలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



కర్నూలు(సెంట్రల్): 2014 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎమ్మెల్యే అభ్యర్థిని డోన్ నుంచే ప్రకటించిన సీఎం, ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దారని.. ఇది కదా అసలైన పండుగ అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం డోన్‌లో నిర్వహించిన సీఎం బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. హంద్రీనీవా నుంచి 77 చెరువులకు నీటిని నింపే ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేసి నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని పశ్చిమ ప్రాంత కరువు రక్కసిని పారద్రోలేందుకు వచ్చారని, ఇది జగనన్న పండుగ రోజు ఇచ్చిన బహుమతి అన్నారు. చంద్రబాబునాయుడు కొబ్బరి కాయ కొట్టి వదిలేసిన హంద్రీనీవా నుంచి 68 చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమాన్ని రూ.253.37 కోట్లతో మరో 9 చెరువులకు అదనంగా నీరిచ్చేందుకు పనులు చేపట్టి పూర్తి చేశారన్నారు. డోన్ నియోజకవర్గంలో ఒక ఎకరం పొలానికి కూడా నీటి పారుదల వసతి లేదని, ఇప్పుడు వ్యవసాయం పండుగలా మారుతోందన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.5 నుంచి 5.5 టీఎంసీలకు పెంచే పనులు రూ.60 కోట్లతో ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. సీఎం చొరవతో డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. గత పాలకులు కోళ్లను బయటకు పంపితే ఎత్తుకుపోయేవాళ్లని, ఇప్పుడు నెమళ్లను పంపినా ఎవరూ ముట్టడంలేదంటే శాంతిభద్రతలు ఏ స్థాయిలో అదుపులో ఉన్నాయో అర్థమవుతుందన్నారు. చంద్రబాబు అవినీతి కేసులో జైలుకు వెళితే టీడీపీ నాయకులు దీక్షలు చేపట్టడం హాస్యాస్పదమన్నారు. ఆయన అవినీతిని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి వివరాలతో ప్రజలకు వివరిస్తామన్నారు.

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి

ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం నంద్యాల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది. జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు ఇక్కడి ప్రజలకు ఓ వరం. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో సీఎం వైఎస్ జగన్ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు మెరుగుపడ్డాయి.

– డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, కలెక్టర్, నంద్యాల జిల్లా



మా నమ్మకం నువ్వే.. అభిమాని ఆనందం



ఎగిసిన ఉత్సాహం.. సభలో యువత



ఎండను సైతం లెక్క చేయకుండా.. బహిరంగ సభా ప్రాంగణం నిండిపోవడంతో బయటే వేచి ఉన్న జనం

క్లుప్తంగా

ఈ-క్రాప్‌లో సూపర్‌చెక్ తప్పనిసరి



గోవర్ధనగిరిలో సూపర్ చెక్ నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియలో మరింత పారదర్శకతను పెంపొందించేందుకు సూపర్ చెక్‌కు అధికారులు శ్రీకారం చుట్టారు. పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడంలో రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జీలు కీలకం. వీరు నమోదు చేసిన వివరాలను సూపర్ చెక్ ద్వారా పరిశీలిస్తారు. రెవెన్యూ యంత్రాంగం, వ్యవసాయ యంత్రాంగం ఏఏ మండలాల్లో ఏఏ గ్రామాలు, ఏఏ సర్వే నెంబర్లను చెక్ చేయాలనే విషయాన్ని కమిషనరేట్ నిర్ణయిస్తుంది. ఈ-క్రాప్‌లో నమోదు చేసిన వివరాల ప్రకారమే క్షేత్రస్థాయిలో ఉన్నాయా, లేదా అనే విషయాన్ని వీరు పరిశీలిస్తారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి, శ్రీరంగాపురం గ్రామాల్లో సూపర్‌చెక్ నిర్వహించారు. పొరపాట్లు ఉంటే సూపర్‌చెక్ ఆధారంగా సరిదిద్దుకునే అవకాశం ఉంది.

29 నుంచి గ్రామీణ యువకులకు టైలరింగ్‌లో శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు యువకులకు ఈనెల 29 నుంచి ఉచిత భోజనం, వసతి సౌకర్యంతో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు 9000710508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

కర్నూలు సిటీ: వచ్చే ఏడాది మార్చి నెలలో జరుగనున్న పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన టెన్త్ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని డీఈఓ డా.వి రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో వచ్చే నెల 1 నుంచి 05వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో 06 నుంచి 11వ తేదీలోపు, రూ.500 అపరాధ రుసుంతో 12 నుంచి 16వ తేదీలోపు చెల్లించాలన్నారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రుసుం రూ.80, ఆన్‌లైన్‌లో దరఖాస్తు లింక్ www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఉందుబాటులో ఉందని డీఈఓ పేర్కొన్నారు.

చెదల మందు తాగి వ్యక్తి మృతి

కర్నూలు : చెదల మందును పొరపాటున మద్యంగా భావించి తాగిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కర్నూలులోని కొత్తపేటకు చెందిన రామేశ్వరరెడ్డి (49) వంట మాస్టర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో దాచి ఉంచిన చెదల మందును మద్యంగా భావించి తాగి సొమ్మసిల్లి పడిపోయాడు. కొద్దిసేపు తర్వాత కుటుంబ సభ్యులు కనుగొని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక సాయంత్రం మృతిచెందాడు. ఈయనకు కొడుకు, కూతురు సంతానం. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా గణపతి నవరాత్రోత్సవాలు ప్రారంభం



సాక్షిగణపతి వద్ద మృత్తికా గణపతికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు,



యాగశాలలో ప్రత్యేక పూజలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో సోమవారం వినాయక చతుర్థి పురస్కరించుకొని నవరాత్రోత్సవాలకు శాస్త్రోక్త పూజలతో శ్రీకారం చుట్టారు. శ్రీశైలానికి 2 కి.మీ దూరంలో ఉన్న సాక్షిగణపతి ఆలయలంలోని స్వామివారికి, ఆ ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన మృత్తికా (మట్టి) గణపతికి, శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భ గణపతికి, యాగశాలలోని కాంస్య గణపతిమూర్తికి విశేష చవితి పూజలను ఈఓ లవన్న, అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. మల్లన్న భక్తులకు శ్రీశైలాన్ని దర్శించుకునట్లుగా సాక్ష్యం చెప్పే సాక్షిగణపతి ఆలయంలో అర్చకులు లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని పాడి సమృద్ధిగా ఉండాలని ప్రజలు సుఖశాంతులను కలిగి ఉండాలని కోరారు. అనంతరం నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని సాక్షిగణపతి స్వామికి ప్రత్యేక అభిషేకం, విశేష అర్చనలు నిర్వహించారు. పంచామృతాలతో, ఫలోధకాలతో, శుద్ధజలంతో ఎంతో శాస్త్రోక్తంగా అభిషేకాన్ని నిర్వహించారు.

మృత్తికా గణపతికి ప్రత్యేక పూజలు..

గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా సాక్షిగణపతి ఆలయంలో ప్రత్యేకంగా మృత్తికా గణపతిని ఏర్పాటు చేశారు.

ఈ ఉదయం సాక్షిగణపతి స్వామివారికి పూజాదికాలు ముగిసిన వెంటనే వ్రతవిధానంలో ఈ మృత్తికా గణపతి వారికి విశేషంగా పూజాదికాలు జరిపించారు. నవరాత్రోత్సవాల ముగింపు రోజున ఈ మృత్తికా గణపతికి నిమజ్జనోత్సవం నిర్వహిస్తారు.

యాగశాలలో..

గణపతి నవరాత్రోత్సవాలలో భాగంగా స్వామివారి యాగశాలలో ఉత్సవ సంబంధిత కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని ముందుగా మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం కంకణపూజ, కంకణధారణ, ఋత్విగ్వరణం మొదలైన కార్యక్రమాలు జరిపించారు. అనంతరం యాగాశాలలో నెలకొల్పిన పంచలోహ గణేశమూర్తికి విశేష పూజలు నిర్వహించారు. మండపారాధనలు, జపానుష్టానాలు, పారాయణాలు, సాయంకాల హవనములు, గణపతి హోమం జరిపించారు. కాగా ఉత్సవాల చివరి రోజైన ఈ నెల 27వ రోజున జరిగే పూర్ణాహుతి, కలశోద్వాసన, అవభృదోత్సవ కార్యక్రమాలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

ఉచిత సామూహిక సేవ

ధర్మప్రచారంలో భాగంగా దేవస్థానం వినాయక చవితిని పురస్కరించుకుని సోమవారం ఉచిత సామూహిక గణపతి పూజ నిర్వహించారు. ఈ పూజల్లో తెల్ల రేషన్‌కార్డు కలిగిన భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ఉపముఖ్యమంత్రి



మల్లన్న దర్శనార్థం వస్తున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను మంగళవారం సాయంత్రం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్ లవన్న, అర్చకులు, ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

మహా గణపతిం.. మనసా స్మరామి



నంద్యాల సంజీవనగర్ రామాలయంలో చెరకుగడలతో నెలకొల్పిన ఇక్షుదండ మహా గణపతి



కర్నూలు పాతబస్టాండ్ సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున 56 అడుగుల మట్టి గణపతి

మా బొజ్జ గణపయ్య.. మమ్మేలా రావయ్యా.. అంటూ విఘ్నేశ్వరుడికి భక్తజనం స్వాగతం పలికి హారతులు పట్టారు. వినాయక చవితి సందర్భంగా సోమవారం జిల్లాలో వాడవాడలా విభిన్నమైన విగ్రహాలను నెలకొల్పి పూజలు చేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుతామని కొందరు భక్తులు మట్టి ప్రతిమలను కొలువుంచి ప్రణమిల్లారు. రకరకాల నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జైజై గణేశా.. జయములివ్వు గణేశా.. ఉండ్రాలయ్యా.. దండాలయ్యా అంటూ డీజేలు హోరెత్తుతున్నాయి. విద్యుత్ కాంతులతో మండపాలు వెలిగిపోతున్నాయి. చిన్నా.. పెద్దా తేడా లేకుండా మండపాల వద్ద సందడి చేస్తున్నారు.

– కర్నూలు (కల్చరల్)/ నంద్యాల (వ్యవసాయం)

పీరు సాహెబ్ పేటలో ఇరువర్గాల గొడవ

- వివాదానికి కారణమైన వాట్సప్ గ్రూపులో ఫొటో పోస్టు
- ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితులపై స్టేషన్ ఆవరణలో దాడి
- నలుగురికి గాయాలు, ధ్వంసమైన పోలీసు జీపు
- ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు





హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్ల శ్రీనివాసులు, మహిళలు

మిడుతూరు: వాట్సాప్ గ్రూపులో ఫొటో పోస్టు చేసిన విషయం రెండు వర్గాల మధ్య దాడికి దారితీసింది. మండల పరిధిలోని పీరు సాహెబ్ పేట గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. పీరుసాహెబ్ పేటలో ప్రతి ఏటా వినాయకుడిని ప్రతిష్ఠించి వేడుకలు జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా గ్రామంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. విగ్రహం వద్ద వడ్డె ఎల్ల శ్రీనివాసులు, బోయ వెంకట మద్దిలేటి కలిసి ఫొటో దిగారు. ఆ ఫొటోను వడ్డె ఓబన్న యూత్ వాట్సాప్ గ్రూపులో ఎల్లశ్రీనివాసులు పోస్టు చేశారు. వేరే కులస్తుడితో దిగిన ఫొటోను ఎలా గ్రూపులో పోస్టు పెడతావని అదే గ్రూపులో ఉన్న గ్రామానికి చెందిన సంపంగి శివకృష్ణతో పాటు మరికొందరు వడ్డె ఎల్లశ్రీనివాసులుతో సోమవారం వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మిడుతూరు ఏఎస్ఐ సుబ్బయ్య ఘటనా స్థలానికి వెళ్లి గొడవకు పాల్పడిన వారిని విచారించారు. జరిగిన ఘటనపై మంగళవారం ఉదయం స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఎల్లశ్రీనివాసులు, రమణమ్మ, వెంకటనరసమ్మ, మహేశ్వరమ్మ మిడుతూరుకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన కుంచెపు మద్దిలేటి, కుంచెపు బొబ్బిలితో పాటు మరికొందరు ఫిర్యాదుదారులపై స్టేషన్‌లో దాడికి దిగారు. ఈ ఘటనలో ఫిర్యాదుదారులకు గాయాలు కావడంతో పాటు స్టేషన్ జీపు అద్దాలు సైతం ధ్వసమయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు మిడుతూరు సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. విషయం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున స్టేషన్‌కు చేరుకుని దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కాగా ఈ ఘటనపై ఇరువర్గాలకు చెందిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్లశ్రీనివాసులు వర్గానికి చెందిన మాధవస్వామి ఫిర్యాదు మేరకు 11 మంది(సంపంగి శివకృష్ణ, కుంచెపు రామకృష్ణ, వెంకటరమణ, మద్దిలేటి, బొబ్బిలి, మధుకుమార్, మధుగోపాల్, మధుమోహన్, మధుక్రిష్ణ, శివమధు, మహేశ్వరి)పై, ప్రత్యర్థి వర్గానికి చెందిన రాములమ్మ ఫిర్యాదు మేరకు ఐదుగురి (ఎల్లశ్రీనివాసులు, మహేశ్వరి, రాజు, అంజి, మారెమ్మ)పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా



ఆలూరు సెబ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య

ఆలూరు రూరల్: రాష్ట్రంలో అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య అన్నారు. మంగళవారం ఆయన ఆలూరు సెబ్ పోలీసు స్టేషన్, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్షేత్రగుడి, మార్లమడికి చెక్‌పోస్టులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల సరిహద్దుల నుంచి అక్రమ మద్యం సరఫరా కాకుండా ఆయా చెక్‌పోస్టుల సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయించే వారిని అదుపులో తీసుకుని కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా సెబ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, ఆలూరు సెబ్ సీఐ ఎర్ర వెంకట్, చెక్‌పోస్టు సీఐలు ఆదినారాయణ, సునంద, ఎస్ఐ రాజశేఖర్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్ఐ పరుగు పరీక్షలో 578 మంది ఎంపిక

కర్నూలు: రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలంలో 18వ రోజు దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పర్యవేక్షణలో మంగళవారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 922 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత వీరికి బయోమెట్రిక్, ఛాతీ, ఎత్తు కొలతలను నిర్వహించారు. అనంతరం శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించగా 1600 మీటర్ల పరుగులో 717 మంది, 100 మీటర్ల పరుగులో 473 మంది, లాంగ్ జంప్‌లో 541 మంది ప్రతిభను కనపరచి ఉత్తీర్ణులయ్యారు. అన్ని ఈవెంట్లలో 578 మంది అర్హత సాధించి తుది రాత పరీక్ష కు అర్హత సాధించారు.

గైర్హాజరు అభ్యర్థులకు 21న అవకాశం...

ఎస్ఐ ఉద్యోగుల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించి దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమైన నాటి నుంచి (ఆగస్టు 25వ తేదీ నుంచి) ఇప్పటి వరకు గైర్హాజరైన మహిళా అభ్యర్థులు, ఏదైనా సమస్య, ఇతర కారణాలతో అప్పీల్ చేసుకున్న మహిళా అభ్యర్థులు సెప్టెంబర్ 21వ తేదీన మాత్రమే హాజరు కావాలని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ పేర్కొన్నారు.

గణేష్ వేడుకల్లో విషాదం



మృతి చెందిన పవన్ కుమార్(ఫైల్)

మంత్రాలయం : వినాయక చవితి వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి మండల కేంద్రానికి చెందిన పవన్ కుమార్(24) అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రాఘవేంద్రపురం చెందిన కాశమ్మ కుమారుడు పవన్ కుమార్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి వినాయక పంటపంలో ఫోకస్ లైట్ కనెక్షన్ ఇవ్వటానికి పోయి అనుకోకుండా తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురైయ్యాడు. పక్కనే ఉన్న వాళ్లు సర్క్యూట్ నుంచి కింద పడిపోయిన పవన్ కుమార్‌ను పరిశీలించగా అప్పటికే ప్రాణాలు వదిలాడు. అనుకోకుండా చేతికొచ్చిన కొడుకు మృత్యువాత పడడంతో తల్లి కాశమ్మ బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య కుటుంబ సభ్యులకు రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేసి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

- నందవరం గ్రామంలో వినాయక చవితి రోజు విషాదం



మృతి చెందిన వడ్డే సూర్య

బనగానపల్లె రూరల్ : టిప్పర్ ఢీకొని సోమవారం ఓ విద్యార్థి మృతి చెందాడు. మండల పరిధిలోని నందవరం గ్రామంలో ఈ ఘటన జరిగింది. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. వినాయక చవితిని పురస్కరించుకుని నందవరం గ్రామానికి చెందిన హనుమక్కగారి శ్రీనివాసులు కుమారుడు వడ్డే సూర్య (9), అదే గ్రామానికి చెందిన జంబులయ్య కుమారులు ఈశ్వర్, దస్తగిరిస్వామితో పాటు మరికొందరు పిల్లలు స్థానిక మండపం వద్ద ట్రాక్టర్ ట్రాలీపై ఆడుకుంటున్నారు. నంద్యాల నుంచి బనగానపల్లె వైపు వెళ్తున్న టిప్పర్ వేగంగా వచ్చి ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాలీలో ఆడుకుంటున్న పిల్లలందరూ ఎగిరిపడగా వడ్డే సూర్య తలపై టిప్పర్ టైర్లు వెళ్లాయి. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా ఈశ్వర్, దస్తగిరిస్వామి తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులిద్దరిని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న నందివర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సూర్య మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. కాగా మృతి చెందిన వడ్డే సూర్య స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి అభ్యసిస్తున్నారు. హనుమక్కగారి శ్రీనివాసులకు కుమారుడు, కూతురు సంతానం. వినాయక చవితి రోజు ఏకైక కుమారుడు మృతితో బాధిత కుటుంబం విషాదంలో మునిగింది.

విస్తృతంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



దిన్నెదేవరపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సురక్ష టోకెన్‌లు అందజేస్తున్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే విస్తృతంగా కొనసాగుతోంది. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 29వ తేదీ వరకు సాగుతుంది. ఇందులో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్నారు. ఎవరికైనా అనారోగ్యం ఉంటే వారి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇలాంటి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ అందజేస్తున్నారు. ఈ టోకెన్ తీసుకుని ఈ నెల 30వ తేదీ నుంచి జరిగే వైద్యశిబిరాల్లో పాల్గొని చికిత్స చేయించుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, స్పెషలిస్టు వైద్యులచే చికిత్స చేసి మందులు అందజేస్తారని చెబుతున్నారు. ఈ వైద్యుల పరిధిలోకి రాని వ్యాధులు ఏవైనా ఉంటే అలాంటి వారిని గుర్తించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తారని సూచిస్తున్నారు. ఈ మేరకు సర్వే జరుగుతున్న తీరును జిల్లా ప్రోగ్రామ్ అధికారులు మంగళవారం పర్యవేక్షించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ గార్గేయపురం గ్రామంలో కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశాలకు తగు సూచనలు అందజేశారు. ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. వైద్యశిబిరంలో ఏడురకాల పరీక్షలు(బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ, యూరిన్, గళ్ల పరీక్ష) నిర్వహిస్తారని, వాటి ఫలితాల ఆధారంగా మందులు అందజేస్తారన్నారు. అలాగే నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్‌లను పంపిణీ చేశారు. ఈ టోకెన్‌లను తీసుకుని వైద్యశిబిరానికి వస్తే వైద్యపరీక్షలు నిర్వహించి నిపుణులైన వైద్యులచే చికిత్స అందించి మందులు అందజేస్తారని ఆమె సూచించారు.

నైపుణ్యాభివృద్ధిపై నివేదిక



ఎంపీడీఓతో మాట్లాడుతున్న జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్

పత్తికొండ రూరల్: ఎస్సీ, ఎస్టీల్లో నైపుణ్యాభివృద్ధి సాధనకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, బంజారా హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌నాయక్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీల నైపుణ్యాభివృద్ధి సాధన కోసం స్థలం కేటాయించి, ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎస్టీ కమిషన్ చైర్మన్, కలెక్టర్‌కు విన్నవించారు. ఈ మేరకు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ మంగళవారం పత్తికొండ ఎంపీడీఓ కవితను కలిసి మండలంలోని గిరిజన గ్రామాలు, ఎస్సీ, ఎస్టీ కులాల వారీగా సమాచారాన్ని సేకరించారు. జిల్లాలో అతిపెద్ద గిరిజన మండలమైన తుగ్గలి వివరాలు కూడా సేకరించినట్లు ఆయన తెలిపారు. యువతలో నైపుణ్యాలు వెలికితీసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొత్త రైతులకు వైఎస్ఆర్ రైతుభరోసా

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ రైతుభరోసా కింద కొంత మంది రైతులు పెట్టుబడి సాయం పొందే అవకాశం లభించింది. ఇప్పటికే దాదాపు అర్హత కలిగిన రైతులందరికీ పెట్టుబడిసాయం అందింది. అయితే ఇటీవల కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టాదారుపాసు పుస్తకాలు పొందిన రైతులకు కూడా వైఎస్ఆర్ రైతుభరోసా వర్తింప జేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త రైతులు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలతో ఆర్‌బీకే ఇన్‌చార్జీలను సంప్రదించి రైతుభరోసా పోర్టల్‌లో పేర్లు నమోదు చేయించుకునే అవకాశాన్ని కల్పించింది. కొత్త రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన కొత్త రైతులకు అక్టోబర్‌లో పెట్టుబడి సాయం విడుదలయ్యే అవకాశం ఉంది.